శునకమంటే వణుకే..

- బెంబేలెత్తిస్తున్న కుక్కలు
- ఆందోళనలో ప్రజలు
- జాగ్రత్తగా ఉండాలంటున్న అధికారులు



అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఇటీవల ఎక్కడ చూసినా వీధి కుక్కల సంఖ్య పెరిగిపోతోంది. రోడ్లపై గుంపులుగా సంచరిస్తున్న వీటిని చూసి జనం బెంబేలెత్తిపోతున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో చిన్నారిపై వీధికుక్కలు దాడి చేసి ప్రాణాలు బలిగొన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రజలు శునకాలు కనిపిస్తేనే భయాందోళన చెందుతున్నారు. అయితే వీధి కుక్కలు కనపడితే పిల్లలు, పెద్దలు భయపడవద్దని, పరిగెడితే వెంటపడి కరుస్తాయని పశుసంవర్ధకశాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. తగిన జాగ్రత్తలు తీసుకుంటే కుక్కకాటు నుంచి తప్పించుకోవచ్చని సూచిస్తున్నారు.

వీధి కుక్కలకు శస్త్రచికిత్సలు

కుక్కలు ఇటీవల కాలంలో గొర్రెల మందలపై దాడులు చేయడం, విద్యార్థులు, చిన్నారులను కరవడం ఎక్కువైంది. ఈ నేపథ్యంలో వాటి నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా సంతానోత్పత్తి కలగకుండా వాటికి కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేస్తున్నారు. రాజమహేంద్రవరం నగరపాలకసంస్థలో 2016 నుంచి ఇప్పటివరకు 9,096 వీధికుక్కలకు శస్త్రచికిత్సలు చేశారు. ఆపరేషన్ అయిన కుక్కలు దీర్ఘాయుష్షుతో బతకడమే కాకుండా ఆరోగ్యంగా ఉంటాయి. చెవిని కత్తిరించి వీ ఆకారంలో ఉంటే ఆపరేషన్ అయిందని గుర్తు. ఆడకుక్కల వెంట మగ కుక్కలు తిరగడం చాలా వరకు తగ్గిపోతుంది. ఆపరేషన్ అయినవి కరవడం చాలా తక్కువ. ఎందుకంటే వాటిలో ఆగ్రహం తగ్గిపోతుంది. కుక్కల నివారణకు శస్త్రచికిత్సలు, రేబిస్ టీకాలు వేయించడం సురక్షితమైన శాశ్వత పరిష్కారం.

జాగ్రత్తలు ఇలా..

- కుక్కదగ్గరికి వస్తే ఏమాత్రం కదలకుండా నిలబడి ఉండటం ఉత్తమం. ఎట్టి పరిస్థితిల్లోనూ పరిగెత్తరాదు. కుక్కల కళ్లలోకి తదేకంగా చూడరాదు. వాటి పిల్లల దగ్గరికి వెళ్లరాదు. తల్లికుక్క కరిచే ప్రమాదం ఉంది.
- నిద్రిస్తున్నప్పుడు, తింటున్నప్పుడు, పిల్లలకు పాలిస్తున్నప్పుడు వాటిని కర్రలు, రాళ్లతో కొట్టడం చేయకూడదు.
- ఒకవేళ కుక్క దాడి చేస్తే ముఖాన్ని చేతులతో కప్పుకోవాలి. ముఖాన్ని కరిస్తే ఇన్‌ఫెక్షన్ మెదడుకు త్వరగా సోకుతుంది.
- కుక్క కోపంగా దగ్గరికి వస్తే నేలవైపు చూస్తూ దానికి దూరంగా మెల్లగా నడవాలి. ఎలాంటి భయం లేకుండా తనదారిన తాను పోతే కుక్కలు పట్టించుకోవు.
- ఒకవేళ కుక్క కరిస్తే అక్కడ కుళాయి లేదా చెంబుతో నీటిధారపోస్తూ సబ్బుతో పది నిమిషాలు కడగాలి. లైఫ్‌బాయ్ సబ్బు అయితే మంచిది. డెటాల్, బెటాడిన్ లేదా గడ్డం గీసుకున్న తర్వాత వాడే లోషన్ పూయాలి. వీలైనంత త్వరగా వైద్యుడిని సంప్రదించి చికిత్స చేయించుకోవాలి. పిచ్చికుక్క అయితే వెంటనే యాంటీ రేబిస్ టీకాలు వేయించాలి. అయితే గాయాన్ని రుద్ది కడగరాదు. గాయంపై టింక్చర్ అయోడిన్ వేయకూడదు. గాయానికి కట్లు వేయడం, గట్టిగా నొక్కడం చేయరాదు.

నియంత్రణకు చర్యలు



తగిన జాగ్రత్తలు తీసుకుంటే కుక్కకాటు నుంచి తప్పించుకోవచ్చు. కొందరు కుక్కలను చూసి కరుస్తాయనే భయంతో ముందుకు వెళ్లరు. అది పద్ధతి కాదు. మనం భయపడేకొద్దీ కుక్కలు చెలరేగిపోతాయి. ప్రభుత్వం వీధికుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టింది. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేపడుతున్నారు. పెంపుడు కుక్కలకు విధిగా టీకాలు వేయించాలి.

– డాక్టర్ రమేష్‌చంద్ర, సూపరింటెండెంట్, పశువైద్యశాల, రాజమహేంద్రవరం.

శస్త్రచికిత్సలు



నగరపాలకసంస్థ పరిధిలోని 5 వేల వీధి కుక్కలకు యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌లో కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేసేందుకు చర్యలు తీసుకున్నాం. ప్రస్తుతం రోజుకి 10 నుంచి 15 కుక్కలకు వైద్యులు శస్త్రచికిత్సలు చేస్తున్నారు. గడిచిన ఆరు నెలల్లో 734 కుక్కలకు ఆపరేషన్లు చేశాం. దీనివల్ల కుక్కల సంతానోత్పత్తి తగ్గుతోంది.

– డాక్టర్ వినూత్న, ఎంహెచ్‌వో, రాజమహేంద్రవరం కార్పొరేషన్

క్లుప్తంగా

ఆక్రమణల తొలగింపు



ఇరిగేషన్ కాలువలో సాగుతున్న ఆక్రమణల తొలగింపు పనులు

కడియం: కడియపులంక పంచాయతీ పరిధిలోని దోసాలమ్మ కాలనీ వద్ద నుంచి వీరవరం వరకు ఉన్న ఇరిగేషన్ కాలువపై ఉన్న ఆక్రమణలను మంగళవారం తొలగించారు. వేమగిరి పంపింగ్ స్కీమ్ కాలువను ఆనుకుని ఉన్న దేవదాయశాఖ భూమి సమీపంలో కాలువను పూడ్చివేసి కొందరు ఆక్రమించినట్లు అధికారుల దృష్టికి ఫిర్యాదులు వెళ్లాయి. ఈ నేపథ్యంలో దేవదాయ, రెవెన్యూ అధికారుల సమక్షంలో కాలువలో వేసిన పూడికను యంత్రాల సాయంతో తొలగించారు. కార్యక్రమంలో వీరవరం ఆలయ ఈవో బీవీ సుబ్బారావు, వీఆర్‌వో చందు, స్థానిక నాయకులు కొత్తపల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



గ్రంథాలను పంపిణీ చేస్తున్న శేఖర్‌బాబు తదితరులు

కడియం: మండలంలోని పొట్టిలంకలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక రాజమహేంద్రవరం కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం త్రైత సిద్ధాంతి భగవద్గీత ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా సిద్ధాంత గ్రంథాలను పంపిణీ చేశారు. వేదిక అధ్యక్షుడు శేఖర్‌బాబు, సభ్యులు లక్ష్మీనారాయణ, విజయ్, జయరామ్, రాణి, సంధ్య, సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు. శేఖర్‌బాబు మాట్లాడుతూ త్రైత సిద్ధాంత జ్ఞానం ద్వారా సమాజంలో కులమతాలను రూపుమాపడానికి, ప్రజల మధ్యలో ఉన్న అసమానతలను తొలగించడానికి, సర్వ మతాలకు దేవుడు ఒక్కడేనని ప్రజల్లో భక్తిని పెంపొందించడానికి దోహదం చేస్తుందన్నారు.

బైబిలు మిషను మహాసభలు ప్రారంభం



మాట్లాడుతున్న షారోన్ కుమార్

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక మార్గాని ఎస్టేట్స్ ఆవరణలో మంగళవారం బైబిలు మిషను 56వ మహాసభలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కన్వీనర్ ఎస్‌జే షారోన్ కుమార్ ప్రార్థనతో మహాసభలు ప్రారంభించారు. కో కన్వీనర్ ఎస్.సుదన్ షారోన్ అధ్యక్షత వహించగా రత్నంరాజు, శుభాకర్, పరంజ్యోతి, మార్టిన్ లూథర్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భక్తులందరికీ అల్పాహారం, వసతిని సుదర్శన్ షాపింగ్ మాల్ అధినేత సుదర్శన్ ఏర్పాటు చేశారు.

బీజేపీ అసెంబ్లీ కోఆర్డినేటర్ల నియామకం



యెనుముల రంగబాబు, రాజమహేంద్రవరం అర్బన్ కోఆర్డినేటర్

రాజమహేంద్రవరం సిటీ: జిల్లాలో భారతీయ జనతా పార్టీని బలోపేతం చేసేందుకు అవసరమైన ప్రణాళికల్లో భాగంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు నూతన కోఆర్డినేటర్లను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు బొమ్మల దత్తు తెలిపారు. ఈ మేరకు మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. నూతన కోఆర్డినేటర్లు తమ అసెంబ్లీలోని మండలాల్లో పూర్తిస్థాయిలో కమిటీలు వేసే విధంగా మండల అధ్యక్షులతో కలిసి పని చేయాలన్నారు. 2024 ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రతి అసెంబ్లీ కోఆర్డినేటర్ పనిచేయాలని పిలుపు నిచ్చారు. రాజమహేంద్రవరం అర్బన్‌కు యెనుముల రంగారావు (రంగబాబు), రాజమహేంద్రవరం రూరల్‌కు ఆకుల శ్రీధర్, రాజానగరానికి ఏపీఆర్ చౌదరి, అనపర్తికి ఎం. శివరామ కృష్ణంరాజు, కొవ్వూరుకు మాట్ల ఆంజనేయులు, నిడదవోలుకు బండి సత్యనారాయణ, గోపాలపురానికి మైలు శ్రీనివాస్ నియమించారు.

6న బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

రాజమహేంద్రవరం సిటీ: బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఏప్రిల్ 6న ఘనంగా నిర్వహించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు పిలుపు నిచ్చారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం జిల్లా పదాధికారులు, జిల్లా ప్రవాస యోజన అసెంబ్లీ కన్వీనర్, ఇన్‌చార్జులతో సమావేశం నిర్వహించారు. రానున్న రోజుల్లో చేపట్టాల్సిన పార్టీ కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు తారేట్ల చింతాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

పురస్కార గ్రహీతకు సత్కారం



మహాలక్ష్మిని అభినందిస్తున్న గురుకులం కరస్పాండెంట్, ప్రిన్సిపాల్

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఆల్కాట్ గార్డెన్స్‌లోని సత్యసాయి గురుకులం రెండో తరగతి విద్యార్థిని గ్రంధి దాక్షాయిని సత్యకృష్ణ శ్రీమహాలక్ష్మి నాట్య పోటీల్లోని రెండు విభాగాల్లో విజేతగా నిలిచి నాట్య చూడామణి పురస్కారం అందుకుంది. ఈ విషయాన్ని గురుకులం ప్రిన్సిపాల్ కె.గుర్రయ్య మంగళవారం తెలిపారు. భారతీయ ఆర్ట్స్ అకాడమీ, ఏబీసీ ఫౌండేషన్, హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల రవీంద్ర భారతిలో నిర్వహించిన మహిళా దినోత్సవం, ఉగాది సంబరాలులో ఆమె ప్రతిభ చూపింది. ఈ నేపథ్యంలో మంగళవారం గురుకులంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థినిని కరస్పాండెంట్ శ్యాంసుందర్, ఉపాధ్యాయులు అభినందించారు.

17న వాహనాలకు వేలం

మధురపూడి: కోరుకొండ ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో పట్టబడిన వాహనాలకు ఈనెల 17వ తేదీన బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు సెబ్ సీఐ జి.సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. ఒక ఆటో, 40 ద్విచక్ర వాహనాలకు వేలం వేస్తామన్నారు. పాల్గొనేవారు ఆధార్, పాన్‌కార్డులతో పాటు రూ.5 వేలు డిపాజిట్ చేయాలన్నారు. వేలం అనంతరం డిపాజిట్ చేసిన నగదు తిరిగి చెల్లిస్తామన్నారు.

చెత్త తరలించే దారేది!



ధవళేశ్వరం పంచాయతీ కార్యదర్శి సూరిబాబుకు వినతి పత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

- కంపోస్టుయార్డు లేక ధవళేశ్వరం వాసుల అవస్థలు
- పంచాయతీ ప్రాంగణంలోనే చెత్త

ధవళేశ్వరం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే మేజర్ గ్రామ పంచాయతీ ధవళేశ్వరం. సుమారు 13 కిలోమీటర్లు విస్తీర్ణంలో 75 వేల మంది జనాభా ఇక్కడ నివసిస్తున్నారు. అయితే గ్రామంలో తీసిన చెత్తను వేసేందుకు కంపోస్టు యార్డు లేకపోవడంతో వారం రోజులుగా గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒకానొక దశలో పంచాయతీ అధికారులు సైతం ఏమీ చేయలేక ట్రాక్టర్లలో ఉన్న చెత్తను పంచాయతీ ఆవరణలో ఉంచాల్సిన దుస్థితి ఏర్పడింది. సమస్యను తెలుసుకున్న స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు మంగళవారం పంచాయతీ కార్యాలయంలో అత్యవసరంగా సమావేశమయ్యారు. సమస్యను పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లారు. తాత్కాలికంగా పంచాయతీ ఆవరణలో ఉంచిన చెత్తను వేరొక చోట డంప్ చేయించడంతో మంగళవారం మధ్యాహ్నం నుంచి గ్రామంలో తిరిగి పారిశుధ్య పనులు ప్రారంభమయ్యాయి. అయితే తీసిన చెత్తను మరల ఎక్కడ వేయాలో అన్న పరిస్థితితో సమస్య మొదటికి వచ్చింది.

నిత్యం పారిశుధ్య పనులు

ధవళేశ్వరంలో ఆరు ట్రాక్టర్లు ద్వారా ప్రతి రోజూ పారిశుధ్య పనులు చేపడుతున్నారు. గ్రామంలో ఉదయం, సాయంత్రం సుమారు 15 నుంచి 20 ట్రాక్టర్ల చెత్తను సేకరిస్తారు. దీనిని ధవళేశ్వరం శివారు బొమ్మూరు సమీపంలోని కంపోస్టు యార్డులో ప్రతి రోజూ డంప్ చేసేవారు. అయితే ఇటీవల అక్కడ చెత్త వేసేందుకు నిరాకరించడంతో తీసిన చెత్తను ఎక్కడ వేయాలో తెలియని పరిస్థితి పంచాయతీ అధికారులకు ఎదురైంది. తాత్కాలికంగా కాటన్ బ్యారేజీ దిగువ తూర్పు డెల్టా కాలువ పక్కనే చెత్తను డంప్ చేస్తున్నారు. అయితే అక్కడ కూడా చెత్త వేసేందుకు కుదరదంటూ అధికారులు స్పష్టం చేయడంతో తీసిన చెత్తను ఎక్కడ వేయాలో తెలియన పరిస్థితి ఏర్పడింది.



ధవళేశ్వరం పంచాయతీ ఆవరణలో చెత్తతో నిండిన ట్రాక్టర్లు

పంచాయతీ ఆవరణలోనే..

సోమవారం గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో సేకరించిన చెత్తను ఎక్కడా వేసే మార్గం లేక పంచాయతీ ఆవరణలో ఉంచాల్సిన దుస్థితి నెలకొంది. సమస్య తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నాయకులు స్పందించి వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ దృష్టికి విషయాన్ని తీసుకువెళ్లారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి సూరిబాబుకు సైతం వినతి పత్రాన్ని అందజేశారు. బుధవారం ఉన్నతాధికారులను కలిసి సమస్యను వివరిస్తామని వారు స్పష్టం చేశారు. ధవళేశ్వరం శివారు జాతీయ రహదారిని ఆనుకొని ఒక కంపోస్టు యార్డులో ధవళేశ్వరం పంచాయతీకి సంబంధించి స్థలం కూడా ఉందని అయినప్పటికీ అక్కడ చెత్త వేసేందుకు ఉన్నతాధికారులు అడ్డు చెప్పడం తగదని వైఎస్సార్ సీపీ నాయకులు స్పష్టం చేశారు. విషయాన్ని ప్రజాప్రతినిధుల దృష్టికి కూడా తీసుకువెళతామన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో వైఎస్సార్ సీపీ నాయకులు సాధనాల చంద్రశేఖర్ (శివ), తలారి వరప్రసాద్, గోలి దేవకుమార్, ఒంటెద్దు కృష్ణ, దేవులపల్లి సరితా రాణి, షట్టర్ బాషా, ఒంటెద్దు కృష్ణ, పుట్టా పరేష్‌నాథ్, రేగుళ్ల రాజు, శ్రీరంగం బాలరాజు, డాక్టర్ చొల్లంగి సత్యగిరి, బోడపాటి కుమార్, పేర్ల బాసి, పెన్నాడ లక్ష్మి, బొడ్డేటి శివాజీ, మెండా రాజేష్, సత్యం వెంకట రమణ, దాసరి ధర్మ ఉన్నారు.

భయాందోళన

ఒక పక్క గ్రామంలో సేకరించిన చెత్తను ఎక్కడ వేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. మరో పక్కన వైరస్ కారణంగా గ్రామంలో అనేక చోట్ల పదుల సంఖ్యలో పందులు చనిపోయి ఉంటున్నాయి. కనీసం వాటిని తీసి మరొక చోట వేయలేని పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ఇప్పటికే అనేక ప్రాంతాల్లో అనారోగ్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ అధికారులు దీనిపై కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకొని గ్రామమంతా బ్లీచింగ్ చల్లాలని, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకులు సూచించారు.

డంపింగ్ యార్డు తరలించాలని ఆందోళన



డంపింగ్‌యార్డు వద్ద ఆందోళన చేస్తున్న బొమ్మూరు ప్రజలు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు జేఎల్‌బీ నగర్ సమీపంలో నివాసాల మధ్య ఉన్న డంపింగ్ యార్డు కాలుష్యం వల్ల పెద్దలు, పిల్లలు రోగాల బారిన పడుతున్నారని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డులో జంతు కళేబరాలను తగులబెట్టడం వల్ల పొగవ్యాప్తి చెంది ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇది గ్రామంలోని 1500 కుటుంబాల సమస్య అని, కలెక్టర్ పట్టించుకోవాలని కోరారు. జాతీయ రహదారిపై ఉన్న డంపింగ్ యార్డు వద్ద మంగళవారం ఉదయం గ్రామ ప్రజలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ వార్డు మెంబరు ఎలుగొండ లక్ష్మి మాట్లాడుతూ చుట్టుపక్కల గ్రామాల చెత్త కూడా ఈ డంపింగ్ యార్డులో వేస్తున్నారని, కలెక్టర్, అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. దుర్వాసన కారణంగా భోజనాలు చేయలేక పోతున్నామని, దోమల బెడద పెరిగిందని, జ్వరాల బారిన పడుతున్నామని ఆవేదన చెందారు. మాజీ సర్పంచ్ మత్సేటి ప్రసాద్ మాట్లాడుతూ డంపింగ్ యార్డును తరలిస్తామని జిల్లా పంచాయతీ అధికారి ఇచ్చిన హామీ ఇంతవరకూ నెరవేరలేదన్నారు. పిల్లా తనూజ మాట్లాడుతూ సమీపంలోనే ప్రాథమిక పాఠశాల, హైస్కూలు, అంగన్‌వాడీ కేంద్రం ఉన్నాయని, విద్యార్థులు రోగాల బారిన పడుతున్నారన్నారు. తరలించకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో జిల్లా పంచాయతీ అధికారి జగదాంబ అక్కడకు వచ్చి వారం రోజుల్లో డంపింగ్ యార్డు తరలించేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మత్సేటి శివ, రాయుడు సునీల్ కుమార్, కంఠం శ్రీనివాస్, చిట్టి జగ్గునాయుడు, నరాలశెట్టి శ్రీనివాస్, కోట్ల దుర్గ, ఈతకోట సందీప్, మరడపు చిన్న, మరడపు రాంబాబు, పిల్ల సురేష్ పాల్గొన్నారు.

నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

- నేటి నుంచి రోడ్డు విస్తరణ పనులు
- కమిషనర్ దినేష్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని తట్టుకోవడానికి నగరపాలక సంస్థ కొన్ని చర్యలు చేపట్టిందని కమిషనర్ కె.దినేష్ కుమార్ తెలిపారు. షెల్టన్ జంక్షన్‌లో రోడ్డు విస్తరణ ప్రాంతాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిత్యం రద్దీగా ఉండే మోరంపూడి జంక్షన్ నుంచి షెల్టన్ జంక్షన్ వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టనున్నట్టు తెలిపారు. తొలిదశలో 80 అడుగుల రోడ్డు విస్తరణ చేపట్టనున్నట్టు ప్రకటించారు. దీనిపై రెండు నెలలుగా సర్వే చేశామని, దాదాపు 62 నిర్మాణాలు ఈ రోడ్డు విస్తరణలో పాక్షికంగా ప్రభావితం అవుతాయన్నారు. ఆ యజమానులు నగరపాలక సంస్థకు సహకరించడానికి ముందుకు వచ్చారని తెలిపారు. బుధవారం నుంచి రోడ్డు విస్తరణ పనులు ప్రారంభిస్తామన్నారు. షెల్టన్ జంక్షన్ నుంచి తిలక్ రోడ్డు వరకు విస్తరణ వల్ల సిటీలో ట్రాఫిక్‌కు మార్గం సుగమవుతుందన్నారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ సూరజ్ కుమార్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ వరహాల బాబు పాల్గొన్నారు.



విస్తరణ పనులపై మాట్లాడుతున్న కమిషనర్ దినేష్‌కుమార్

వైఎస్సార్ సీపీ నాయకుడు కరీంఖాన్‌కు పుత్ర వియోగం

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ మైనారిటీ విభాగం నాయకుడు, జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ కరీం ఖాన్‌కు పుత్రవియోగం జరిగింది. ఆయన పెద్ద కుమారుడు ఇద్రీస్ ఖాన్ (36) హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు. ఆయన భౌతిక కాయాన్ని మంగళవారం రాజమహేంద్రవరం దానవాయిపేట గానుగ వీధిలోని స్వగృహానికి తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి.. కరీంఖాన్ నివాసానికి వెళ్లి ఇద్రీస్ ఖాన్ భౌతిక కాయానికి నివాళులర్పించారు.



కరీంఖాన్‌ను పరామర్శిస్తున్న అడపా శ్రీహరి

వసతి గృహాల సందర్శన

కంబాలచెరువు: నగరంలోని పలు వసతి గృహాలను జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రత్యూష కుమారి మంగళవారం సందర్శించారు. ముందుగా ఉద్యోగినుల వసతి గృహాన్ని సందర్శించి అక్కడి వారితో మాట్లాడారు. వసతులను పరిశీలించారు. ఎటువంటి సమస్యలున్నా వెంటనే తమకు తెలిపాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, శుచికరమైన భోజనాన్ని అందించాలని సిబ్బందికి తెలిపారు. అనంతరం ఎస్టీ బాలికల సంక్షేమ వసతి గృహాన్ని సందర్శించి అక్కడి విద్యార్థినులతో మాట్లాడారు. ఇంటర్ పరీక్షలు రాస్తున్న వారంతా మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

కంబాలచెరువు: స్థానిక కంటిపూడి రామారావు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని డీవైఈవో తిరుమలదాస్ మంగళవారం పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న నూతన మెనూపై విద్యార్థుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని దాదాపు 80 శాతం విద్యార్థులు తినడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల అభీష్టానికి అనుగుణంగా జగనన్న గోరుముద్దలో మెనూని రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు మార్చుతూ, రుచికరమైన భోజనం అందిస్తోందన్నారు. త్వరలో ఉదయం రాగి జావ కూడా ఇవ్వనున్నారన్నారు. ఐఎంఎంఎస్ యాప్‌లో విద్యార్థి, తల్లిదండ్రుల అభిప్రాయాల వీడియోలను కూడా అప్‌లోడ్ చేయాలని ప్రధానోపాధ్యాయుడు దుర్గాప్రసాద్‌కు సూచించారు.

నేడు సచివాలయ కన్వీనర్ల సమావేశం

రాజమహేంద్రవరం రూరల్: ఏపీగ్రీనరీఅండ్ బ్యూటీఫికేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ ఆధ్వర్యంలో ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డులోని చందన గార్డెన్స్‌లోని వైఎస్సార్ సీపీ రూరల్ నియోజకవర్గ కార్యాలయంలో బుధవారం ఉదయం పది గంటలకు సచివాలయం కన్వీనర్ల సమావేశం జరుగుతుంది. ఈ మేరకు పార్టీ కార్యాలయం నుంచి మంగళవారం ప్రకటన విడుదలైంది.

ఐన్‌స్టీన్ జయంతి

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాలలో ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో మంగళవారం భౌతిక శాస్త్రవేత్త ఐన్‌స్టీన్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలోని ఆయన విగ్రహానికి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.ఆంజనేయులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆశాఖాధిపతి పీవీ.సత్యాజీ, శ్రీశైలశాస్త్రి, డాక్టర్ డి.సునీత పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలు

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో పంటకోత ప్రయోగాలను నిష్పక్షపాతంగా చేయాలని వ్యవసాయాధికారులను, ఏఎస్‌వోలను జిల్లా ముఖ్యప్రణాళిక అధికారి కె.ప్రకాశరావు ఆదేశించారు. మంగళవారం ఆయన తొర్రేడులోని మల్లిన సోమరాజు, నరుకుల సాయిరామకృష్ణ వరిపొలాల్లో నిర్వహించిన పంటకోత ప్రయోగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంటకోత ప్రయోగాల ద్వారానే ధాన్యం దిగుబడి సగటు తెలుస్తుందన్నారు. విపత్తు సమయంలో తద్వారా బీమా సొమ్ము చెల్లించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌వో రామం, వీఏఏ శ్రీనివాస్, వీహెచ్ సురేఖ, హెచ్‌డీఎఫ్‌సీ జిల్లా ఇన్సూరెన్స్ కోఆర్డినేటర్ భగవాన్ పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణతో ఆరోగ్యం

కడియం: నులిపురుగుల కారణంగా చిన్నారుల్లో రక్తహీనత తదతర అనారోగ్య సమస్యలు ఏర్పడతాయని మండల విద్యాశాఖాధికారి వి.లజపతిరాయ్ అన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ మంగళవారం ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ విస్తృతంగా చేపట్టారు. ఈ సందర్భంగా కడియం నెం.1 ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 16,724 మందికి మాత్రలు అందజేయాలన్నది లక్ష్యం కాగా తొలి దశలోనే 95 శాతం మందికి అందించినట్లు వివరించారు. వైద్య సిబ్బంది, ఉపాధ్యాయుల సహాయంలో ఆయా పాఠశాలల్లో చిన్నారులకు మాత్రల పంపిణీ జరిగిందన్నారు.



కడియంలో మాత్రలు వేస్తున్న ఎంఈవో లజపతిరాయ్